క్లుప్తంగా

వైభవంగా వార్షికోత్సవాలు



పూజలో పాల్గొన్న తోటకూర వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: అశోక్‌నగర్ కాలనీలోని శ్రీ మైసమ్మ తల్లి 2వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, 6వ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైసమ్మ తల్లి భక్తుల కోరికలు తీర్చే తల్లిగా పేరొందిదన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి సోదరభావంతో మెలగాలన్నారు.

సేవాలాల్ బంజారా కార్యాలయం ఏర్పాటు



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్ సాయినగర్ కాలనీలో సేవాలాల్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ శుభాష్ నాయక్, ఆర్‌టీఐ కమిషనర్ శంకర్ నాయక్ ప్రారంభించారు. అనంతరం సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ప్రతిష్టాపనోత్సవం



నూతనంగా ప్రతిష్ఠించిన సాయిబాబా విగ్రహం

మల్కాజిగిరి: ఆదర్శనగర్‌లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో షిరిడీ సాయిబాబాతో పాటు ఇతర దేవతా విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అర్చకులు బాల సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో యంత్ర, విగ్రహ ప్రతిష్టాపన, పూర్ణాహుతి, కుంభాభిషేకం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగాయి. పూజల్లో దేవాలయ కమిటీ ప్రతినిధులు పెంటయ్య, శ్రీనివాసరెడ్డి, రవీంద్రనాథ్, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు



కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు 89 కోట్ల నిధులను కేటాయించడం పట్ల ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రభాకర్ కలిసి శాలువాతో సత్కరించారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కవిత

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని సంఘాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణే అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు అన్నోజు క్రిష్ణ చారి, ప్రధాన కార్యదర్శి రాజేష్ చారి, దేవరకొండ పుల్లయ్య చారి, బుజ్జోజు శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా నియామకమైన నాచారం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతలకంటి రాజు అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ఏ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వీఎస్ ప్రకాష్‌రెడ్డి, మక్తాల శేఖర్‌గౌడ్, కృష్ణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

‘టాయిలెట్స్ 2.0’ ఫీడ్ బ్యాక్ సర్వేలో..

పీర్జాదిగూడనే ప్రథమం

- రూ.1.15 కోట్లతో మరుగుదొడ్ల నిర్మాణం
- బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్రం నిషేధం
- స్వచ్ఛతలో ఇతర నగర పాలక సంస్థలతో పోటీ

పబ్లిక్ టాయిలెట్స్‌ను ఆధునిక హంగులతో నిర్మించి నిర్వహణ చేపడుతుండటంతో వరించిన అవార్డు

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో ఆధునిక హంగులతో పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించారు. రూ.1.15 కోట్లతో వ్యయంతో 13 చోట్ల నిర్మించిన ఈ పబ్లిక్ టాయిలెట్స్ అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ చేపట్టిన ‘టాయిలెట్స్ 2.0’ ఫీడ్ బ్యాక్ సర్వే 2023లో పీర్జాదిగూడ నగర పాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సర్వేలో తెలంగాణ రాష్ట్రం నుంచి 141 మున్సిపాలిటీలు పాల్గొనగా పీర్జాదిగూడ నగర పాలక సంస్థ నుంచి 39,543 మంది ప్రజలు పాల్గొన్నారు. దీంతో పీర్జాదిగూడ నగర పాలక సంస్థకు మొదటి స్థానం దక్కింది. మెరుగైన జీవన ప్రమాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనలో పీర్జాదిగూడ నగర పాలక సంస్థ ఇతర నగరాలతో పోటీ పడుతుంది.



పీర్జాదిగూడలో నిర్మించిన ఆధునిక పబ్లిక్ టాయిలెట్స్



రూ.1.15 కోట్లతో పబ్లిక్ టాయిలెట్స్...

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ పీర్జాదిగూడలో భాగంగా ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం రూ.1.15 కోట్ల వ్యయంతో 13 చోట్ల (48 సీట్లు) పబ్లిక్ టాయిలెట్స్‌ను ఆధునిక హంగులతో నిరించారు. మేడిపల్లిలో భగత్‌సింగ్ కాలనీ వద్ద, అన్నపూర్ణ కాలనీ వద్ద, మారుతీనగర్ పార్కు వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద, మోడ్రన్ బస్టాప్ ఏవీ ఇన్ఫోప్రైడ్ వద్ద, పీర్జాదిగూడలో ఉప్పల్ బస్ డిపో ఒమేగా మహిళ కళాశాల వద్ద, ఎస్‌టీఓ ఆఫీసు వద్ద, బుద్ధానగర్ 40 అడుగుల రోడ్డు వద్ద, బుద్ధానగర్ పార్కు వద్ద, గ్లోబల్ స్కూల్ వద్ద, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద, పర్వతాపూర్‌లో అరోరా కళాశాల వద్ద, వార్డు కార్యాలయం వద్ద ఈ పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

బహిరంగ ప్రదేశాల్లో నిషేధం...

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనలు నిషేధం. నగర పాలక సంస్థ పరిధిలో వంద శాతం ఇండ్లకు టాయిలెట్స్ నిర్మాణం. దేశంలోని ఆధునిక నగరాలతో పోటీ పడేలా పారిశుధ్య పనుల నిర్వహణ, చెత్తాచెదారాన్ని తొలగించడం, రోడ్లు, పార్కు స్థలాలు, ఖాళీ ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. నగర ప్రజలు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శానిటేషన్, పర్యావరణ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు.

‘మాపై మరింత బాధ్యత పెరిగింది’



‘టాయిలెట్స్ 2.0’ ఫీడ్ బ్యాక్ సర్వే-2023లో మా నగర పాలక సంస్థ మొదటి స్థానంలో నిలవడంతో మాకు మరింత బాధ్యత పెరిగింది. పరిశుభ్రమైన, మోడల్ నగర పాలక సంస్థగా రూపొందేందుకు అధికారులు, పాలకవర్గం నిరంతరం కృషి చేస్తున్నాం. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో ఓడీఎఫ్ సిటీగా అరుదైన గుర్తింపు దక్కగా.. మంత్రి కేటీఆర్ చేతుల మీదగా ప్రశంసా పత్రాలను అందుకున్నాం. ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేసినా, మల, మూత్ర విసర్జన చేసినా జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పబ్లిక్ టాయిలెట్స్‌లో మహిళలకు ప్రత్యేకంగా షీటాయిలెట్స్, స్లమ్ ఏరియాలో కమ్యూనిటీ టాయిలెట్స్‌ను నిర్మించాం.

– జక్క వెంకట్‌రెడ్డి, మేయర్ పీర్జాదిగూడ నగర పాలక సంస్థ

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 10వ డివిజన్‌లో రూ. 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. 10వ డివిజన్‌లో తాగునీటి సమస్య ఉందని స్థానిక ప్రజలు మేయర్ దృష్టికి తీసుకురాగా ఆయన సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ, దొంతర బోయిన మహేశ్వరి, బీఆర్ఎస్ నాయకులు బొమ్మక్ బాలయ్య, కృపాసాగర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నిధులు కేటాయింపు పట్ల హర్షం



రైల్వే మంత్రిని కలిసిన నాయకులు

మల్కాజిగిరి: ఎంఎంటీఎస్ ఫేస్-2కు రూ. 600 కోట్లు కేటాయించడం పట్ల మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ హర్షం వ్యక్తం చేశారు. నగరానికి వచ్చిన కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కార్పొరేటర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రవణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వాటా జాప్యం జరుగుతుండడంతో సమస్యను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే రైల్వే మంత్రికి లేఖ రాశారని దాన్ని దక్షిణ మధ్య రైల్వే జీఎంకు అందజేశామన్నారు. నిధులు కేటాయించడంతో ఎంఎంటీఎస్ పనులు పూర్తయితే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు రైల్వే మంత్రిని కలిసిన వారిలో నూర్, శ్రీనివాస్, రాఘవేంద్ర, అనిత ఉన్నారు.

స్థలాల సమస్యలు పరిష్కారమయ్యే దాకా పోరాడుతాం



ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్ ఆపిన స్థలాల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టి వంటవార్పు, ధర్నా కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు నుంచి బోడుప్పల్ వాసుల స్థలాలను కాపాడాలని కోరారు. 40 ఏళ్ల క్రితం చేసిన లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, అలాంటి స్థలాల్లో 2018లో వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలాలుగా ప్రకటించి రిజిస్ట్రేషన్, ఇంటి అనుమతులు నిలుపుదల చేయడం దారుణమన్నారు. ఆస్తులు మావే హక్కులు మావే, కేటీఆర్ మామా.. మా అమ్మ నాన్నాల బాధ వినవయ్యా అంటూ చిన్నారులు ప్లే కార్డులు పట్టుకుని కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నేతలు కొత్త కిశోర్‌గౌడ్, గోనె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

మల్కాజిగిరి: వెస్ట్ శ్రీకృష్ణానగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం కాలనీలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పగిలిపోయిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించాలని, చాలా చోట్ల కాలనీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులకు సమస్య పరిష్కరించాలని సూచించామని కార్పొరేటర్ తెలిపారు. కార్పొరేటర్ వెంట రామక్రిష్ణ, శ్రీనివాస్, రాము, లక్ష్మణ్, మురళి, వేణు ఉన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషిచేస్తాం

బోడుప్పల్: అంజనేయనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షులుగా బి. ఫణికిశోర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి. శ్రీనివాస్, కోశాధికారిగా టీ.సుదీప్, ఉపాధ్యక్షులుగా ఎ.సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం. కొండల్ రెడ్డి, కృష్ణ భూషణ్ ఎన్నికయ్యారు. మొత్తం 214 ఓట్లు ఉండగా 119 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుల పోటీలో ఉన్న ఫణి కిశోర్‌రెడ్డికి 114 ఓట్లు, బాలేశంకు 3 ఓట్లు వచ్చాయి. మిగతా కమిటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులు ఫణికిశోర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అందరిని సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను మాజీ ప్రతినిధులు హరినాథ్‌రెడ్డి, భానుప్రకాశ్, జయసింహాగౌడ్ అభినందించారు.



నూతన కమిటీని అభినందిస్తున్న కాలనీవాసులు

భూమి పూజలో పాము కలకలం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో బీసీల ఆత్మగౌరవ భవనాలకు ఆదివారం మంత్రులు భూమి పూజ చేశారు. భూమి పూజకోసం తవ్విన గోతిలోకి మంత్రి శ్రీనివాస్ గౌడ్ దిగి కొబ్బరికాయ కొట్టి బయటకు వచ్చారు. అందరూ వెళ్లిపోయిన కాసేపటికి అదే గుంతలో పాము ప్రత్యక్షమైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అక్కడి వచ్చిన వారంతా ఆందోళనకు గురయ్యారు.



భూమి పూజ తర్వాత ప్రత్యక్షమైన పాము

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చర్లపల్లి, సిల్వర్‌ఓక్‌లో నివసించే ఈదర రోహిత్‌రెడ్డి (22) దుండిగల్‌లోని ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం బైక్‌పై ఎల్‌బీ నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్నాడు. చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-4 బస్టాప్ సమీపంలో ఎదురుగా వచ్చిన రెడిమిక్స్ లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రోహిత్‌రెడ్డిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి ..

కుషాయిగూడ: చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గత నెల 24న చర్లపల్లి పారిశ్రామికవాడలోని భారత్ గ్యాస్ కంపెనీ సమీపంలో రోడ్డు పక్కన ఓ వ్యక్తి పడిఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందిన వృద్ధుడు శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 65-70 ఉంటుందని, చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని సంబంధీకులు ఉంటే కుషాయిగూడ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సాయికుమార్ పేర్కొన్నాడు.

సృజనాత్మకతను వెలికితీయాలి



బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్

రామంతాపూర్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీస్తే వారు భవిష్యత్‌లో వేలాదిమందికి ఉపాధి కల్పిస్తారని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. సెయింట్ జాన్ స్కూల్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సూరం రాంరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మమతారెడ్డి, చోకయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 5కే రన్

కాప్రా: ఈసీఐఎల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యంగ్ డైనమోస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 5కే రన్‌లో విద్యార్థులు, ప్రముఖులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు రకాల వ్యాధుల నివారణకు రన్ చక్కటి ఔషధమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

కాప్రా: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని జమ్మిగడ్డ అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్‌కుమార్ అన్నారు. జమ్మిగడ్డలో నిర్వహించిన జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎస్‌ఏ రహీం, స్థానికులు జాషువా, రాములు, రవినాయక్, దయానంద్, నాగేష్, కొండల్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఉప్పల్: వారాంతపు సాంస్కృతిక సంబరాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రమణి సిద్ధి ఆధ్వర్యంలో నెల నెలా కళారాధన, కార్యక్రమంలో స్వర రాగ సుధ సంగీత విద్యాలయం, కాకినాడ గురువు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి శిష్యబృందం ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధం చేసింది.

కేసీఆర్ కాలనీ అధ్యక్షుడిగా దొమ్మాట కిరణ్‌రావు

కాప్రా: కేసీఆర్(మల్లికార్జున)కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా దొమ్మట కిరణ్‌కుమార్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన కాలనీ అసోసియేషన్ కమిటీ ఎన్నికలో అధ్యక్షుడిగా కిరణ్‌రావు, గౌరవాధ్యక్షులుగా వాసంశెట్టి రాంబాబు, సరిపాక మల్లేష్, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాసీం, వాసంశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఒంటెద్దు లింగస్వామి, కోశాధికారిగా రాజు, సంయుక్త కార్యదర్శులుగా అంకోజు ప్రవీణ్‌చారి, చాగంటి బోసాయ, గుండు శ్రీనివాస్, సిరిపాక శ్యామ్, ప్రచార కార్యదర్శులుగా మెరుగు మహేష్, షేక్ బాషా, సలహాదారులుగా మహ్మద్ అఫ్జల్, గడిపె రవి, బొజ్జ వెంకటేష్, నదునూరి ప్రభాకర్, మామిడిపెల్లి రాంబాబులను ఎన్నుకున్నారు.

మురుగు పరుగు.. పరిష్కారం దేవుడెరుగు..



మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవానీనగర్ కాలనీలో గత నెల రోజులుగా భూగర్భ డ్రైనేజీ పొంగి పార్లుతుండటంతో వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతుందని ఉన్నతాధికారులు స్పందించి మురుగు సమస్యకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

– మల్లాపూర్

వివాహితకు వేధింపులు

మైనర్ బాలుడికి కౌన్సెలింగ్

కుషాయిగూడ: పనిచేసే చోట పరిచయమైన ఓ వివాహితను మైనర్ బాలుడు వేధింపులకు గురిచేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. సైనిక్‌పురి, కందిగూడకు చెందిన ఓ వివాహిత సైనిక్‌పురిలోని ఓ వస్త్రాల దుకాణంలో పనిచేస్తుండగా ఆమెతో పాటు మౌలాలి, హెచ్‌బీకాలనీకి చెందిన (17) బాలుడు పని చేసేవాడు. వారి పరిచయం కాస్తా చనువుగా మారింది. గత కొన్ని రోజులుగా సదరు మహిళ బాలుడిని దూరంగా పెడుతూ వచ్చింది. దీన్ని జీర్ణించుకోలేని బాలుడు పలుమార్లు ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోవడంతో కోపం పెంచుకున్నాడు. ఈ నెల 2న ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా మార్గమధ్యలో అడ్డుకొని అసభ్యపదజాలంతో దూషించి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లాడు. ఆ ఫోన్ లోంచి ఆమె భర్తకు ఫోన్ చేసి బూతులు తిట్టడం.. ఆమె ఫొటోలను న్యూడ్‌గా చిత్రీకరించి ఫోన్‌లో స్టేటస్ పెట్టడం.. ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్లకు కాల్ చేసి ఆమె పట్ల అసభ్యంగా మాట్లాడాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వివాహిత కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించింది. ఈ నెల 4న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన బాలుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బాలుడి వయసు 20 సంవత్సరాలుగా ఉండగా పోలీసులు విచారణలో మైనర్‌గా తేలడంతో కౌన్సెలింగ్ ఇచ్చి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ వేణుమాధవ్ తెలిపారు.

రెడ్డి సంఘానికి అండగా ఉంటా



కేలండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్: నాచారం రెడ్డి సంఘానికి అండగా ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాచారం రెడ్డి సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నమిలికొండ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానిక ఆయన హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అంపాల అనితా పద్మారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు పోగుల వెంకట రమణారెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులు రాగిడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డి జేఏసీ నాయకులు హరీనాథ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.